# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 10 జనవరి 2025


## టీడీపి పార్టీ కేంద్ర కార్యాలయంలో... మంత్రి

రాయచోటి జనవరి 9 ప్రభాత వార్త

తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నాడు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి పాల్గొని పలు అర్జీలను స్వీకరించారు. పలు దూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను శాఖల వారిగా పరిష్కారానికి మంత్రి ఎండర్స్ చేసి పరిష్కారానికిచొరవ తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పంచమర్తి అనురాధ, కవాలి గిరిష్మా పాల్గొన్నారు.





## బండారు దత్తాత్రేయకు ఘన స్వాగతం

రాజంపేట, జనవరి 9 ప్రభాతవార్త:



అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనేందుకు గురువారం రాజంపేటకు వచ్చిన సందర్భంగా స్థానిక బిజెపి నేతలు హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఘనంగా స్వాగతం పలికారు. దత్తా త్రేయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో ఇక్కడి బిజెపి నేతలందరికీ సుపరిచితుడు. దీంతో దత్తాత్రేయ రాజంపేటకు వచ్చిన సందర్భంగా దత్తాత్రేయను కలుసుకొని ఆయన చిత్రపటాన్ని ఆయనకే కానుకగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జ్ పోతుగుంట రమేష్‌నాయుడు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బిజెపి అధ్యక్షులు సాయిలోకేష్‌తో పాటు స్థానిక బిజెపి నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వెళ్ళి ఆయనకు స్వాగతం పలికారు.

# ఘనంగా అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు..!



వేడుకల్లో మాట్లాడుతున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



హాస్య సినీ నటుడు బ్రహ్మానందంను సత్కరిస్తున్న బండారు దత్తాత్రేయ, గంగిరెడ్డిలు



హాజరైన విద్యార్థినీ విద్యార్థులు, ప్రముఖులు

రాజంపేట, జనవరి 9 ప్రభాతవార్త:

అన్నమాచార్య విద్యా సంస్థల సిల్వర్ జూబ్లీ వేడుకలు గురువారం సాయంత్రం రాజంపేటలోని కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి ఈ వేడుకల్లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రముఖ సినీ హాస్య నటుడు బ్రహ్మానందం, మరో సినీ నటుడు, పూర్వపు కళాశాల విద్యార్థి అబ్బవరం కిరణ్‌లతో పాటు కళాశాల అధినేత, ఛాన్సలర్ చొప్పా గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేడుకలను బండారు దత్తాత్రేయ, బ్రహ్మానందంలతో కలిసి చొప్పా గంగిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేడుకల్లో బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా తాళ్ళపాకలో ఇలాంటి ఉన్నతమైన విద్యాలయాన్ని నెలకొల్పినందుకు గంగిరెడ్డిని దత్తాత్రేయ కొనియాడారు. విద్యార్థులు ఏ రంగంలోనైనా ఎదగాలంటే పట్టుదల, కృషి అవసరమన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరిన గంగిరెడ్డి లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో రాణించాలని పిలుపునిచ్చారు. తద్వారా విద్యార్థులు దేశాన్ని ఉన్నత స్థానానికి తీసుకెళ్ళగలరన్నారు. అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పదని, ఈ రోజుల్లో నిరుద్యోగం, పేదరిక నిర్మూలనకు విద్య ఒక ఆయుధంగా చేసుకొని ఉద్యోగాన్వేషణ కాకుండా ఉద్యోగ కల్పన వైపు విద్యార్థులు, యువత ముందుకు వెళ్ళాలన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తేవడంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాత్రను ఆయన కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ ద్వారా మూడు కోట్ల ఉద్యోగాలు మన దేశానికి భవిష్యత్తులో రాబోతున్నాయన్నారు. యువత వాటిని అందిపుచ్చుకోవాలన్నారు.

### - జీవితంలో వెనుకడుగు వేయకండి - విద్యార్థులకు సినీ హాస్యనటుడు బ్రహ్మానందం పిలుపు

సినీ హాస్యనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ జీవితంలో వెనుకడుగు వేయకండని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జీవితంలో వెనుకడుగు వేయకుండా పోరాటపటిమ చూపినందునే అంబేద్కర్, లాల్ బహుదూర్ శాస్త్రి, అబ్దుల్ కలామ్, మన ప్రధాని నరేంద్రమోడీలు ఉన్నత స్థానానికి చేరుకున్నారన్నారు. నేను కూడా ఏంతో కష్టపడడం వల్లే సినిమాల్లో రాణించగలిగానన్నారు. రాయలసీమలో ఏడుకొండల స్వామి వేంకటేశ్వరస్వామి, అన్నమాచార్యులు, వీరబ్రహ్మేంద్రస్వామి లాంటి మహనీయుల పుట్టినిల్లు అన్నారు. సాగునీరు తక్కువైనందున రాయలసీమ వెనుకబడి ఉందని అనుకోరాదన్నారు. వెంకటేశ్వరస్వామి ఉన్నంతవరకు అన్నమాచార్యులు ఉంటారని, అన్నమాచార్యులు ఉన్నంతవరకు అన్నమాచార్య విద్యాసంస్థలుంటాయన్నారు. ఎంతో కష్టపడి అన్నమాచార్య విద్యాసంస్థలను ఉన్నతంగా గంగిరెడ్డి తీర్చిదిద్దారని కొనియాడారు. కళాశాలల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తనకెంతో ఇష్టమన్నారు. అన్నమాచార్య కళాశాలల్లో చదివిన మరో సినీ నటుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలల అధినేత చొప్పా గంగిరెడ్డి క్రమశిక్షణ, నిర్విరామకృషి వల్లే నేడు ఈ కళాశాల ఉన్నతంగా తెలుగురాష్ట్రాల్లో ఎదిగేందుకు కారణమైందన్నారు. గంగిరెడ్డి జీవితం యువతకు ఆదర్శమన్నారు. అన్నమాచార్య కళాశాలలో చదవడం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. క్రమశిక్షణ లేని తనకు క్రమశిక్షణ ఏర్పడిందన్నారు.

### - విద్యా రంగంలో రాజంపేటకు నూతన శకాన్ని తీసుకొచ్చిన గంగిరెడ్డి

ఈ కార్యక్రమంలో అన్నమాచార్య యూనివర్శిటీ చొప్పా యల్లారెడ్డి, యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జున, పిఆర్ఓ కిషోర్, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ ఎస్.శివరామిరెడ్డి, ఈఈఈ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ ఎం.పద్మలలిత, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ ఎం.సుబ్బారావు, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఎన్ రంగనాధం, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామసుబ్బారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్.సుబ్బారెడ్డిలను అన్నమాచార్య లాంగ్ సర్వీస్ అవార్డ్స్‌తో సత్కరించారు. సత్కారం అందుకున్న వారితో పాటు కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎంవి నారాయణ, యూనివర్శిటీ డిప్యూటీ డైరెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ ఎం.జయరామిరెడ్డి తదితరులు మాట్లాడుతూ విద్యారంగంలో రాజంపేటకు నూతన శకాన్ని అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత గంగిరెడ్డి తీసుకొచ్చారని కొనియాడారు. రాజంపేట పట్టణ శివారు ప్రాంతమైన న్యూ బోయనపల్లె అది. 30 ఏళ్ల క్రితం ముందు నల్లరాళ్లు, కంపచెట్లతో నిండిపోయిన ప్రాంతంలో అన్నమాచార్య విద్యాసంస్థలను గంగిరెడ్డి స్థాపించడం రాజంపేటకు వరంగా మారిందన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల వల్లే రాజంపేట అన్ని రకాల ఉన్నతశ్రేణి విద్యా సౌకర్యాలకు నిలయమైందన్నారు. గంగిరెడ్డి పుట్టింది కొట్టంలో నివసించే ఓ పేద వ్యవసాయ కుటుంబంలో. అయినా కష్టేఫలి సిద్ధాంతంతో రాజంపేట, కడప, తిరుపతి, హైదరాబాద్ లాంటి చోట వందల కోట్ల విలువ చేసే సుమారు 20 లక్షల అడుగుల్లో ఉన్నత శ్రేణి అన్నమాచార్య విద్యా సంస్థలను నిర్మించారన్నారు. ఇంజనీరింగ్ విద్యనే కాకుండా ఎంబిఏ, ఎంసిఏ, ఫార్మశీ, బిఇడి, ఫార్మ్-డి, వ్యవసాయతదితర ఏ ఉన్నత విద్య అయినా నేడు రాజంపేటలో అందుబాటులోకి వచ్చి ఈ ప్రాంత యువతకే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల యువతకు ఆశాజ్యోతిగా గంగిరెడ్డి నిలిచారని కొనియాడారు.

### - అన్నమాచార్య లోగోను..గీతాన్ని ఆవిష్కరించిన దత్తాత్రేయ

అన్నమాచార్య యూనివర్శిటీ లోగోను, గీతాన్ని కార్యక్రమంలో దత్తాత్రేయ ఆవిష్కరించారు. అలాగే కళాశాల 25 సంవత్సరాల వైభవాన్ని పుస్తక రూపంలో ఎకో ఆఫ్ ఎక్సలేన్స్ పూరిట దత్తాత్రేయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రో ఛాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, డీన్లు, హెచ్ఓడీలు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ, బ్రహ్మానందంలను చొప్పా గంగిరెడ్డి ఘనంగా సత్కరించారు.

# అన్నమయ్య జిల్లా వ్యాపితంగా చలిపులి..!

- జనం ఉక్కిరిబిక్కిరి - శీతల గాలులతో పడిపోయిన ఉష్ణోగ్రతలు

(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)

అన్నమయ్య జిల్లా వ్యాపితంగా గత రెండు వారాలుగా ఉష్ణోగ్రతలు పడిపోయి చలి ఎక్కువైంది. చలి ఎక్కువై ఆనారోగ్య పరిస్థితులు కూడా ఎక్కువయ్యాయి. ఒక ప్రక్క ఉష్ణోగ్రతలు తగ్గి ఏ మాత్రం జలుబు, దగ్గు వచ్చినా పలు రకాల వైరస్‌ల ప్రభావాన్ని తలచుకుంటూ అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మొత్తానికి జిల్లాలో చలిపులి ఎక్కువై జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాలతో పోలిస్తే పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి ఏరియాల్లో చలి తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. శీతల గాలులు ఎక్కువై ఉష్ణోగ్రతలు పడిపోయాయి. 10 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకుంటుండడంతో సాయంత్రం 5 గంటల నుండే శీతల గాలులు అధికమవుతున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా శీతల గాలుల కారణంగా చలి తీవ్రత అధికంగానే ఉంటుంది. దీంతో చిన్నలు, వృద్ధులు బయటకు రాలేని పరిస్థితులున్నాయి. మొత్తానికి చలి కారణంగా రెండు వారాల నుండి అన్ని వర్గాల ప్రజలు గజగజ వణికిపోతున్నారు. భారీ వర్షాలు కురవడం వల్ల చుట్టూ అన్ని నదులు, వాగులు, వంకలు, మడుగులు, చెరువుల్లో పుష్కలంగా నీరుండడం వల్ల కూడా చల్లగాలులు అధికంగా ఉండేందుకు కారణంగా కనిపిస్తుంది. రానున్న మరో నెల రోజులు పైగా ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండకపో వచ్చని తెలుస్తోంది. అన్నమయ్య జిల్లాలోని పలు శివారు ప్రాంతాలతో పాటు పట్టణ పరిధిలో కూడా ఉదయం 8 గంటల వరకు మంచు విపరీతంగా కప్పివేస్తున్నది. దీంతో బయటకు వెళితే శరీరమంతా తేమమయంగా మారుతోంది. దీంతో ఒక ప్రక్క మంచుతో గడగడలాడే పరిస్థితులు నెలకొంటున్నాయి. మార్గశిర, పుష్యమాసాలు, హేమంత రుతువులో శీతల గాలులు సాధారణమే. అయితే ఈ ఏడాది చలి తీవ్రత గతంతో పోలిస్తే అధికంగా ఉంది. ఈ ఏడాది శీతల గాలులు ఆసాధారణంగా ఉండడం ఓ రకంగా ఆనారోగ్య పరిస్థితులు పెరగడానికి తోడ్పడుతున్నాయి. ఇందుకు తగ్గట్టు దోమల బెడద కూడా అధిక మైంది. దోమల నివారణకు ఏ మాత్రం అధికారత్రయం చర్యలు తీసుకోని పరిస్థితులున్నాయి. గత ఏడాది వానలు కూడా అన్నమయ్య జిల్లాను వదలకుండా కురిసాయి. అదే విధంగా చలి కూడా తయారైంది. ఉష్ణోగ్రతల్లోని మార్పులు వ్యవసాయం, పశుసంపద, జీవనోపాధి, పర్యావరణం, ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నట్టు వ్యవసాయ శాఖాధికారులు, ఉద్యానవన శాఖాధికారులు, వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక శివారు ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో చలి తీవ్రతకు తోడు శీతల గాలులు అధికమై బాధిస్తున్నాయి. చలి తీవ్రత కారణంగా గూడు లేని వారు, రోడ్లపై తాత్కాలిక గుడారాలు వేసుకున్న వారి పరిస్థితి దయనీయంగా ఉంది. నీడలేని నిర్భాగ్యుల పరిస్థితి ఎముకలు కొరికే చలికారణంగా బాధగా ఉంది. చలి తీవ్రత అధికమైనందున అనారోగ్య పరిస్థితులు అధికమవుతున్నందున ప్రభుత్వం గ్రామీణ ప్రాం తాల్లో దోమల బెడద నుండి ప్రజలను తప్పించేందుకు అవసరమైన నిధులను పంచాయితీలకు సమకూర్చాల్సి ఉంది. మున్సిపాలిటీ పరిధిలో కూడా కాలువలు, నీటి నిల్వల్లో దోమలు పెరగకుండా ఉండేందుకు వీలుగా వేస్ట్ ఆయిల్‌ను చల్లడం, ఫాగింగ్ చేయడం లాంటివి యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సి ఉంది. అలాగే శీతల గాలుల కారణంగా ఉద్యానవన పంటలు దెబ్బతినకుండా అవసరమైన జాగ్రత్తలను, సూచనలను వాణిజ్య రైతులకు అందించాల్సి ఉంది. మొత్తానికి చలి తీవ్రత కారణంగా అన్ని వర్గాల ప్రజలు చాలావరకు సాయంత్రం 5 గంటల నుండి ఉదయం 8 గంటల వరకు బయటకు రాలేని పరిస్థితి ఉంది.



## అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవు



సిద్దవటం, జనవరి 9, ప్రభాతవార్త:

సిద్దవటం మండలంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లి గ్రామాల్లో గురువారం సిద్దవటం అటవీశాఖ ఆధ్వర్యంలో అడవిలో అగ్ని ప్రమాదా గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వల్ల అనేక నష్టాలు జరుగుతాయన్నారు. అటవీ సంపద, వనమూలికలు, జంతువులు, పక్షులు, జీవరాసులు అగ్నికి ఆహుతి అవుతాయని వివరించారు. భక్తులు, ప్రయాణికులు బీడీలు, సిగరెట్లు లాంటివి అడవిలో వెలిగించరాదని, అగ్ని కారక వస్తువులు వెంట తీసుకురాకూడదన్నారు. అడవికి ఎవరైనా నిప్పు పెడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఓబులేసు, సిద్దవటం ఫారెస్టు బీటు అధికారి పెంచల్‌రెడ్డి, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే

రైల్వే కోడూరు జనవరి 9 ప్రభాత వార్త...



రైల్వే కోడూరు మండలంలోని బుడుగుంట పల్లిలో గురువారం తాసిల్దార్ మహబూబ్ చాంద్ ఆధ్వర్యంలో రీ సర్వే ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుడుగుంటుపల్లి గ్రామ పరిధిలోని భూ సమస్యల పరిష్కారం కోసం పలువురు రైతులు రీ సర్వేకు భూ సమస్యల పరిష్కారం కోసం తాసిల్దార్ కు వినతి పత్రములు అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ మండలంలోని బుడుగుంట పల్లి రేవును గ్రామంలో ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక రీ సర్వే గ్రామ సభలో నిర్వహించి రైతుల భూ పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. బుడుగుంట పల్లి పరిధిలో సక్రమంగా ఉన్న భూ రికార్డులను అనుభవదారులను పరిశీలించి భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లక్ష్మీదేవి,వీఆర్వో ఇందిర, సర్వేర్ మమత తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పనిచేయాలి

- విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ రమణ

సిద్దవటం, జనవరి 9, ప్రభాతవార్త:



ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పని చేయాలని విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ తెలిపారు. విద్యుత్తు శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ లింగంపల్లిలోని సబ్ స్టేషన్‌ను మరియు సిద్దవటంలోని ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు క్షేత్రస్థాయిలో స్వయంగా తిరిగి పరిశీలించి తగు సూచనలు చేశారు. సిద్దవటం విద్యుత్తు శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయంలో క్షేత్రస్థాయి అధికారులతో మరియు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు జరుగుతున్న నమోదు ప్రక్రియ రేపటిలోగా పూర్తి చేయాలన్నారు. సద్దవటం మండల పరిధిలో రూ.7.76కోట్ల విద్యుత్తు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. సంస్థ నెల రోజులు గడివిచ్చి బిల్లు కట్ట మంటుంది అంటే మొత్తం 2 నెలల గడువు వినియోగదారునికి ఇస్తుంది. విద్యుత్తు బకాయిల వసూళ్లలో రాజీ వద్దు దయ చూపించే స్థితిలో లేము. విద్యుత్తు బకాయిలు వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైతు దేశానికి వెన్నముక లాంటి రైతుల విద్యుత్తు సమస్యలపై అధిక ప్రాధాన్యతతో దృష్టి సారించాలి. రైతుల విద్యుత్తు సమస్యలైన ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు వేయడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం వంటి తదితర పనులపై వెంటనే స్పందించండి. నెల వారి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. నాణ్యమైన విద్యుత్తును ప్రజలకు అందించాలని తెలిపారు. అలాగే విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలన్నారు. పని తీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన లైన్‌మెన్ సుబ్బాంరెడ్డి మరియు సతీష్‌రెడ్డిలను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో కడప ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు హరి సేవా నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు సుబ్రమణ్యం, ఏఈ జయచంద్ర, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్న భర్తను హత్య చేసిన కేసులో ఐదుగురికి యావజ్జీవ శిక్ష

- రూ.2లక్షలు జరిమానా

జమ్మలమడుగు, జనవరి 9, ప్రభాతవార్త:

5 సంవత్సరాల క్రితం మైలవరం మండలం తొర్రివేముల గ్రామం పరిధిలో జరిగిన దారుణ హత్య కేసులో ప్రొద్దుటూరు ఏడీజే కోర్టు తీర్పు వెలువరించింది. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను ప్రియుడితో కలిసి హత్య చేయించిన భార్య, 5 మందికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.2లక్షలు జరిమానా విధించింది. సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభినందించారు. ముద్దాయిలు తీట్ల సురేష్, పెద్దరాజు, గురుస్వామి, ఉప్పలపాడు ఓబుల్ ప్రతాప్, కుమ్మరి విజయ ప్రమీలకు శిక్ష విదించారు. హతుడు గురుప్రసాద్ బేల్దారి పనికి వెళ్తుండేవాడని అతని భార్య ప్రమీల సురేష్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్న విషయం తెలిసి మందలించాడు. ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని భార్య ప్రమీల ఆమె ప్రియుడు సురేష్‌లు మిగతా ముద్దాయిలతో కలిసి బాబూసాబ్‌బావి వద్ద రాడ్లతో కొట్టి గురుప్రసాద్‌ను దారుణంగా హత్య చేశారు. హతుని తమ్ముడు గురుస్వామి అది చూసి అరవగా ముద్దాయిలు చంపుతామని బెదిరించగా గురుస్వామి పారిపోయి వచ్చి మైలవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ బి.రాంప్రసాద్‌రెడ్డి బలమైన వాదనలతో నిందితులకు శిక్ష పడేలా కృషి చేశారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేసి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.






## పుత్తాను మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీ ఇండస్ట్రియల్ చైర్మన్

**సిద్దవటం, జనవరి 9, ప్రభాతవార్త:**
తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డిని మరియు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డిని ఏపీ ఇండస్ట్రియల్ చైర్మన్ రామరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయనను పుత్తా నరసింహారెడ్డి సన్మానించారు. అనంతరం కమలాపురం రైల్వేగేటు వద్ద వెలసిన శ్రీ రాధాకృష్ణ ఆలయంలో పూజను పుత్తాతో పాటు స్వామి వారి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాజకీయాల్లో సీనియర్ నాయకుడిగా ఉంటూ ఎన్నో కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కమలఆపురం తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు



**ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 9 ప్రభాతవార్త :**
నెహ్రు రోడ్ లోని గీతాంజలి హై స్కూల్లో చైర్మన్ శ్రేయ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు తెలుగు సాంప్రదాయ బద్ధమైన సంక్రాంతి పండగ విశిష్టత గురించి వేషధారణలో డుడు బసవన్న వేషాలు,ముగ్గుల పోటీలు, భోగిమంటల కార్యక్రమాలు అలాగే సంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా నిర్వహించారు.పల్లెటూరి వాతావరణ సాంప్రదాయ పద్ధతులను పిల్లలకు తల్లిదండ్రులు సాంప్రదాయ బద్ధమైన అలవాటు నేర్పించాలని తెలియజేస్తూ వివిధ కార్యక్రమాల్లో నిర్వహించారు.పిల్లలు సంస్కృతిక వేషధారణ వల్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శివరామిరెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇంటర్ డిస్టిక్ యూత్ ఎక్ఛేంజ్ ప్రోగ్రాంలో విద్యార్థినిల ప్రతిభ



**పులివెందుల రూరల్, జనవరి 9, ప్రభాతవార్త :**
ప్రభుత్వ మహిళా కళాశాల పులివెందుల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 1, 2 నుంచి ఎంపికైన విద్యార్థినిలు కె. గంగామోక్షిత మరియు వి.నందిని ఇంటర్ డిస్టిక్ యూత్ ఎక్స్ చేంజ్ ప్రోగ్రాం తరపున జనవరి 2 నుంచి 6 వరకు విశాఖ పట్టణం లోని నెహ్రూ యువ కేంద్రం వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. వికసిత్ భారత్ 2047ను గురించి మాట్లాడిన పోటీలలో మా కళాశాల విద్యార్థిని కె.గంగా మోక్షిత కు ఫస్ట్ ప్రైజ్ వచ్చినది.ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, సిబ్బంది అభినందించారు. విశాఖపట్నంలోని నేవీ డే సెలబ్రేషన్ లో పాల్గొన్నారు. ఈ ప్రోగ్రాం లో ఎన్ ఎస్ ఎస్ తరఫున సమాజానికి ఎలా ఉపయోగపడాలి, నాయకత్వ లక్షణాలు కలిగి అన్ని రంగాలలో ముందుకు ఎలా వెళ్లాలి అనే విషయాలు నేర్చుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎల్. సుధీర, డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ యు శ్రీనిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు



**కలికిరి, జనవరి 9, ప్రభాతవార్త:**
కలికిరి మండలం కె.రెడ్డివారిపల్లెలోని తపస్య పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి ప్రాముఖ్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాలలో సంక్రాంతి రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసు, పతంగులు, గంగిరెద్దులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాఠశాల ఆవరణం ముస్తాబుగా మారింది. విద్యార్థులూ, ఉపాధ్యాయులు తెలుగు సాంప్రదాయంలో వేషధారణతో తెలుగు పండుగ ఉట్టిపడేలా కనిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌ఛార్జి శివప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశువుల గణన సందర్శనకు విచ్చేసిన డిప్యూటీ డైరెక్టర్



**కలికిరి, జనవరి 9, ప్రభాతవార్త:**
మండలంలో 21వ పశువుల గణన పరిస్థితిని ధ్రువీకరించడానికి కలికికి మండలాన్ని మదనపల్లె డిప్యూటీ డైరెక్టర్ (పశుసంవర్ధకశాఖ) డా.సత్యనారాయణ సందర్శించారు. 72 శాతం మండలంలో గణన పూర్తయిందని ఈ సందర్భంగా తెలిపారు. గుట్టపాలెం, కేఆర్ పల్లి, కలికిరి పారపట్ల మరియు గుండ్లూరు రెవెన్యూ గ్రామాల్లో 21వ పశువుల గణనను సందర్శించి ధ్రువీకరించారు. మండలంలోని అన్ని ఇళ్లకు వెళ్లి పశువులను లెక్కించాలని సిబ్బందిని ఆదేశించారు. రాబోయే పశువుల నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం గురించి ఆయన రైతులకు వివరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సూపర్ నేపియర్ పచ్చి మేత సాగు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని 10 నుంచి 50 సెంట్లు వరకు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

## పిచ్చికుక్క దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**గోపవరం ,జనవరి 9, ప్రభాతవార్త**
మండలంలోని రాచాయాపేట పంచాయితీ బెడుసుపల్లి గ్రామానికి చెందిన రైతు పల్లెం సుబ్బారెడ్డి పై గురువారం పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. సుబ్బారెడ్డి పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో కుక్క దాడి చేసింది. గాయపడిన ఆయనను స్థానికులు బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

## వడ్డే ఓబన్న జయంతిని ప్రతి వడ్డెర కులస్తులు జరుపుకోవాలి

**కలికిరి, జనవరి 9, ప్రభాతవార్త:**
ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడుకు మరియు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు బీసీ సంక్షేమ శాఖామంత్రి శ్రీమతి సవితమ్మలకు అలాగే వడ్డెర కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ దేవల్ల మురళీకి మాకు సహకరించిన వడ్డెర నాయకులకు, మా వడ్డెర కుల బంధువులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని పీలేరు నియోజకవర్గ వడ్డెర సంఘం అధయక్షులు బత్తుల రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 11వ తేదీన రేనాటి వీరుడు స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రతి క్క వడ్డెర కులస్థులు జరుపుకోవాలన్నారు. ఆయన బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడారని ఆయన వీరత్వాన్ని కొనియాడారు. ఆయన జయంతిని జరుపుకోవాలని జీవోను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయాలని సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి శ్రీమతి సవితమ్మకు వడ్డెర నాయకులతో కలిసి విన్నవించామని ఆయన తెలిపారు.

## కలికిరిలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ



**కలికిరి, జనవరి 9, ప్రభాతవార్త:**
మండలంలోని కలికిరి రెడ్డివారిపల్లి గ్రామంలో గురువారం రీ సర్వేపై కలికిరి మండలం తహసీల్దార్ మహేశ్వరీబాయ్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం రెడ్డివారిపల్లి రెవెన్యూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద రీ సర్వే చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు రీ సర్వేపై అవగాహన కల్పించే నిమిత్తం తహసీల్దార్ మహేశ్వరీబాయ్ అవగాహన ర్యాలీ నిర్వహించి రీ సర్వేలు చేపట్టే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో 3173.48 ఎకరాలు భూమి ఉంది. దీన్ని 13 ఖండాలుగా 4 టీంలు ఏర్పరచి ప్రతి టీం ప్రతి రోజు 20 ఎకరాల చొప్పున రీ సర్వే చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలం సర్వేయర్ రెడ్డప్ప, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## రితిష్ రెడ్డి సమక్షంలోశాశ్వత సభ్యత్వం స్వీకరణ

### టిడిపి నేత మంచూరు సూర్యనారాయణ రెడ్డి



**అట్లూరు జనవరి 9 ప్రభాత వార్త :**
తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడు మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త యువ నాయకుడు రితీష్ రెడ్డి సమక్షంలో శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గ సమన్వయకర్త రితీష్ రెడ్డి, మంచూరు సూర్యనారాయణ రెడ్డిని అభినందించారు. టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని రితీష్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడు సూర్యనారాయణ రెడ్డి, అట్లూరు మండల సీనియర్ నాయకులు నందగోపాల్ రెడ్డి,అట్లూరు మండల క్రియాశీ నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి లు మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి లో ముందు ఉంచడానికి నియోజకవర్గ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి చేస్తున్న కృషి అమోఘం అన్నారు. అదేవిధంగా శాశ్వత సభ్యత్వం తీసుకున్న తర్వాత బాధ్యత మరింత పెరిగిందని పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని మంచూరు సూర్య నారాయణ రెడ్డి తెలిపారు.

## విద్యాజ్యోతిలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**వాల్మీకిపురం, జనవరి 09 ప్రభాతవార్త:**
మండలంలోని చింతపర్తి శ్రీ విద్యాజ్యోతి చిల్డ్రన్స్ అకాడమీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, వివిధ రకాల సాంస్కృతి కార్యక్రమాలు, గ్రామీణ క్రీడలతో సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్కూల్ కరస్పాండెంట్ ఎస్ఎన్ కుమార్, హెచ్ఎం హసీన పాల్గొని, విద్యార్థులతో కలిసి భోగి మంటను వేసి దాని చుట్టూ తిరుగుతూ కోలాటాలు ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎస్ఎన్ కుమార్ మాట్లాడుతూ అచ్చ తెలుగు పండుగను విద్యార్థులతో కలసి జరుపుకోవడం ఆనందంగా ఉంటుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను ఇనుమడిరప చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి



**వాల్మీకిపురం, జనవరి 09 ప్రభాతవార్త :**
బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మండలంలోని వాల్మీకి సంఘం నాయకులు కలిసి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు నాయకులు నల్లంకి నరసింహులు మాట్లాడుతూ గత 70ఏళ్లుగా బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని అనేక పోరాటాలు చేస్తున్నారని, అయితే ప్రభుత్వాలు, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి బోయలను ఎస్టీజాబితాలోకి చేర్చి వాల్మీకులను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రెడ్డిశ్రీహరి, శేఖర్, నాగరాజు, సురేష్, భాస్కర్, వెంకటశివయ్య, చిన్నోడు, విశ్వనాథ్, శ్రీనివాసులు, రెడ్డెప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం.

**కలకడ జనవరి 9 ప్రభాతవార్త :**
సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం తెలిపారు.కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీదేవి రవికుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## 30 లీటర్ల నాటు సారా స్వాధీనం ఇద్దరు నిందితులు అరెస్టు



**వాల్మీకిపురం, జనవరి 09 ప్రభాతవార్త :**
మండలంలోని శికారిపాళెం అడివిలో గురువారం ఎక్సైజ్ టాస్ఫోర్స్ సిబ్బంది జరిపిన దాడుల్లో ఇద్దరు నిందితులు శీనా(41), శంకరయ్య(40) లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనంతో పాటు 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి టాస్ ఫోర్స్ సీఐ ఎల్లయ్య తెలిపారు. అలాగే శికారిపాళెం అడివిలో జరిపిన దాడుల్లో 1400 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసి, అక్కడ ఉన్న నాటు సారా తయారీ వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నా రు అనంతరం శికారిపాళెం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి నాటు సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. అరెస్ట్ చేసిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్ ఫోర్స్ ఎస్సై శశిధర్, పోలీసులు మోహన్రెడ్డి, వేమారెడ్డి, బాలకృష్ణ, విజ్ఞేష్ రాజశేఖర్ పాల్గొన్నారు.

## వైభవంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



**పీలేరు జనవరి 09 ప్రభాతవార్త :**
పీలేరు చిత్తూరు మార్గంలోని ఇందిరమ్మ కాలనీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలు వైభవంగా నిర్వహించారు. గురువారం పాఠశాల ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు ముందస్తు భోగి, సంక్రాంతి వేడుకల్లో భాగంగా పిల్లలచేత గొబ్బెమ్మ పాటలు పాడించి, భోగి మంటలు, సంక్రాంతి ముగ్గులు వేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ హిందువుల సాంప్రదాయ పండుగల్లో సంక్రాంతి పండుగ ముఖ్యమైందని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించడానికి ఇది ప్రధానమైనదని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబుల్ రెడ్డి, శెట్టి సుబ్రహ్మణ్యం, సెల్వి, పుష్పలత, షకీలా బాను, సరస్వతమ్మ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రీసర్వేపై అవగాహన సదస్సు



**పీలేరు, జనవరి 9 ప్రభాతవార్త :**
పీలేరు మండలం వేపుల బైలు పంచాయితీ పరిధిలో ఈనెల 20వ తేదీ నుంచి రి సర్వే చేపట్టనున్నట్లు సర్వేయర్ కిరణ్మయి తెలిపారు. ఈ మేరకు గురువారం వేపుల బైలు రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ కిరణ్మయి మాట్లాడుతూ వివిధ కారణాలతో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యల పరిష్కారం నిమిత్తం గ్రామపంచాయతీ పరిధిలోని ఉన్న భూములను రీసర్వే చేయనున్నట్లు ఆమె తెలిపారు.. రీసర్వేకి రైతులు ప్రజలు సహకరించి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె తెలిపారు.

## కుమ్మరపల్లి గ్రామస్తుల ధర్నా



**చిన్నమండెం జనవరి 9 ప్రభాత వార్త:**
మండలంలోని చాకిబండ గ్రామం కుమ్మరపల్లి గ్రామంలో దేవాలయానికి వెళ్లే రహదారి కబ్జా చేయడంతోపాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా పైపు లైన్లు ధ్వంసం చేశారని ఆ గ్రామస్తుల ఆరోపిస్తూ తహసిల్దార్ కార్యాలయం వద్ద భైఠాయించి నిరసన వ్యక్తం చేసి తమకు న్యాయం చేయాలనిడిమాండ్ చేసారు. అమరనాధరెడ్డి అనే వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడ్డడని, అతని చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కు వినతి పత్రం ఇచ్చి డిమాండ్ చేసారు.శతాబ్దాలుగా ఉన్న దారిని యధాతథంగా వుండేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

## విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు ధన్యవాదాలు

**పీలేరు జనవరి 9 ప్రభాతవార్త :**
రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ోబుల్ టీచర్స్ అసోసియేషన్( NTA)తరఫున ధన్యవాదాలు . గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన 117 జీవో ప్రభుత్వ పాఠశాలల పాలిట ఒక గుదిబండలా తయారైంది . మూడవ తరగతి నుంచి విద్యార్థులను ఉన్నత పాఠశాలలో కలపడం వలన అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి ప్రాథమిక పాఠశాలల నుంచి విద్యార్థులందరూ ప్రైవేటు పాఠశాలల దారి పట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం జరిగింది. ఈ జీవో వలన విద్యాసంస్థలు నిర్వీర్యము అవుతున్నాయని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ పక్షాన విద్యాశాఖ మంత్రి కి ప్రాతినిధ్యం ద్వారా తెలియజేయడం జరిగింది .వారు సానుకూలంగా స్పందించి 117 జీవోను రద్దు చేస్తూ జీవోను ప్రకటించడం సంతోషదాయకం .ఇది విద్యా క్షేత్రానికి శుభకరమైన కార్యక్రమము అని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ తెలియచేస్తోంది . ప్రభుత్వ విద్యా వ్యవస్థ గాడిలో పడుతుందని, రాబోయే కాలంలో ప్రభుత్వ విద్యాసంస్థలన్నీ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందుతాయని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం కూడా పునరుద్ధరిస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు.

## పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



**సిద్దవటం, జనవరి 9, ప్రభాతవార్త:**
సిద్దవటం మండలంలోని లింగంపల్లి, కడపాయపల్లె గ్రామానికి చెందిన మనోహర్(26), కళాశ్రీ(24) గత మూడు సంవత్సరాలుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. మనోహర్ కడప ఎయిర్‌పోర్టులో డ్రైవర్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కళాశ్రీ, కడప వివేకానంద కళాశాలలో డిగ్రీ చదువుతూ ఒకరికొకరు పరిచయం కావడంతో ప్రేమలో పడ్డారు. కుటుంబ సభ్యులు వీరి వివాహానికి అంగీకరించకపోవడంతో గురువారం ఉదయం 11 గంటలకు ఉమామహేశ్వర నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో వివాహం చేసుకొని పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్సై సుబ్బరామచంద్ర మాట్లాడుతూ ప్రేమ వివాహం చేసుకున్న ఇరువురు మేజర్లు అని ఇరువురి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించగా మనోహర్ కుటుంబ సభ్యులు అంగీకరించి వారి స్వగృహానికి తీసుకెళ్లారని కళాశ్రీ కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో వారి దగ్గర రాతపూర్వకమైన ఫిర్యాదు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక పూజలు.

**కలకడ జనవరి 9 ప్రభాతవార్త :**
వైకుంఠ ఏకాదశి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు అఖిలేష్, నాగయ్య స్వామి లు తెలిపారు. మండలంలోని దేవళంపేటలో వెలసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం నందు, బాట వారి పల్లి లో వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం నందు, మరియు దొడ్డిపల్లి పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం నుండి అభిషేకాలు, అర్చనలు, బిల్వార్చన, రథయాత్ర, కోలాటాలు ,భజనలు, తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు పేర్కొన్నారు.కావున మండలంలోని భక్తాదులు కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## యూత్ వింగ్ అధ్యక్షుడిగా శివ ప్రసాద్ రెడ్డి నియామకం



**చిట్వేలి, జనవరి 9, ప్రభాతవార్త:**
వైసిపి అన్నమయ్య జిల్లా యువజన విభాగ అధ్యక్షుడిగా స్థానిక మండలం నగిరిపాడు కు చెందిన వైసిపి నాయకులు,కాంట్రాక్టర్ యలగచర్ల శివప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. గురువారం తాను మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక పదవిని అందించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ మిథున్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి.అమర్నాథ్ రెడ్డికి, తంబలపల్లి శాసనసభ్యులు ద్వారకానాథ్ రెడ్డికి, మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి కి,గడికోట శ్రీకాంత్ రెడ్డి కి మరియు కొరముట్ల శ్రీనివాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైసిపి పార్టీ పునర్ వైభవం కోసం తన శక్తివంచన మేరకు కృషి చేస్తానని శివప్రసాద్ రెడ్డి తెలిపారు.

## నేడు బండలాగుడు పోటీలు

**పులివెందుల, జనవరి 9, ప్రభాతవార్త :**
పులివెందుల రూరల్ పులివెందుల మండల పరిధిలోని ఉలిమెళ్ళ గ్రామంలో శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉలిమెళ్ళ గ్రామ ప్రజలు ఒక ప్రకటనలో తెలిపారు ముక్కోటి ఏకాదశి మహోత్సవం సందర్భంగా పులిమెళ్ల గ్రామ సమీపంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు బండ లాగుడు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. బండలాగుడు పోటీలలో గెలుపొందిన మొదటి విజేతకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ.50 వేలు అందజేశారు. రెండో బహుమతిని, నాలుగో బహుమతి తొండూరు మండలం గోటూరు కు చెందిన బాలగంగి రెడ్డి రూ.20 వేలు అం దజేయనున్నారు. ఐదో బహుమతిని నరసింహారెడ్డి అందజేయనున్నారు. ఆరో బహుమతి రాచమల్లు మహేశ్వర్ రెడ్డి రూ. 6000 అందజేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు బూచుపల్లి సీతారామ కోలాట బృందంచే కోలాటం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు ఉదయం 9 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో చిట్వేలి ప్రతిభ



**చిట్వేలి, జనవరి 9, ప్రభాతవార్త:**
జనవరి 7,8 తేదీల్లో విజయవాడ లో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ లో చిట్వేలి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విజేతగా నిలిచారు. టీచర్స్ విభాగం నుంచి జీవశాస్త్ర ఉపాధ్యాయుడు అంతటి శివనారాయణ గౌడ్ జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్ కు ఎంపికయ్యారు. వారు రూపొందించిన ఖి ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి కాపర్ కోటెడ్ బాటిల్ అనే ప్రాజెక్టు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా గురువారం నాడు ప్రధానోపాధ్యాయులు ఎ.బి.యన్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, స్వామీజీ,దుర్గరాజు, వెంకటసుబ్బయ్య, గాయత్రి, లక్ష్మీకళావతి, సుహాసిని, బాదూషా పాల్గొన్నారు.

## కిచెన్ కింగ్ మసాల

**ఫలానా మసాలాపొడి వల్ల కూరసూపర్‌గా ఉంది లాంటి ప్రకటనలు చూస్తుంటాం కదూ! అలాంటి వాటిల్లో 'కిచెన్ కింగ్ మసాలా' ఒకటి .**
ఇది బయట కొనేకంటే ఇంట్లోనే చేసుకుంటే మరిత తాజాగా ఉంటుంది. ప్రిజర్వేటివ్స్ ఉండవు కనుక ఆరోగ్యానికీ మంచిది. తేలిగ్గా ఎలా చేయాలంటే.. మినపప్పు, పచ్చి శనగ పప్పు, షాహీ జీరా, ఆవాలు ఒక్కో చెంచా చొప్పున, మెంతులు పావు చెంచా,3 సోంపు 2 టేబుల్ స్పూన్లు ధనియాలు 3 టేబుల్ స్పూన్లు, ఒకటిన్నర చెంచా జీలకర్రలను సన్న సెగ మీద వేయించాలి. అవి గోధుమ రంగులోకి మారేసరికి మంచి వాసన వస్తుంది.

## పిచ్చి బఠాణీలు.. మెచ్చు గుణాలు



**తాజా బఠాణీలు..** ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదూ! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్దేస్తుంది. బఠాణీలను క్యాలీఫ్లవర్, క్యాబేజ్, బంగాళదుంప, క్యారెట్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింపవుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటితో స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెందడంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచుగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ చేరిన సూక్ష్మ క్రిములను నశింపచేస్తాయి. వీటిల్లో ఉండే కెరొటినాయిడ్స్, జిక్సాందౌథిన్లు కళ్లకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడతాయి. యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, ఉబకాయం, గుండెజబ్బుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నిరోధిస్తాయని పరిశోధనల్లో తేలింది. పీచు, పొటాషియం, ప్రొటీన్లు ఉన్నాయి. మాంసాహారం తినని వాళ్లకి మంచి పోషకాహారం. ఇంత మేలు చేసే బఠాణీలను విస్మరిస్తే ఎలా! తరచూ ఏదో రూపంలో తీసుకుందాం. ఆరోగ్యంగా ఉందాం కానీ అవసరమైన దాని కంటే ఎక్కువగా తింటే మాత్రం అనర్థమేనండోయ్.

## వెంకన్నకు శంఖు, చక్రాల బహూకరణ

వేంపల్లి, జనవరి 9, ప్రభాతవార్త :



శ్రీ వేంకటేశ్వరస్వామికి వెండి శంఖు, చక్రాలను బహూకరించారు. స్థానిక పుల్లయ్య తోటకు చెందిన నంది బత్తిని శ్రీనివాసులు, భార్య ఎస్వరం మలు 1,474 గ్రాముల వెండి శంఖు చక్రాలను గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్. విశ్వనాథరెడ్డి, అర్చకులు అచ్యుత్ కుమార్, పి.వి.రమణ సమక్షంలో బహూకరించారు.

## శ్రీ చైతన్య హైస్కూల్ ముందస్తు సంక్రాంతి వేడుకలు



వేంపల్లి, జనవరి 9, ప్రభాతవార్త :

శ్రీ చైతన్య హైస్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు భోగి మంటలతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరించారు. వారి ప్రతిభ ప్రేక్షకుల హృదయాలను కట్టిపడేసింది. అలాగే పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ప్రత్యేకంగా బహుమతులు అందజేశారు. వివిధ వర్గాల్లో పోటీలు నిర్వహించగా, విజేతల సంప్రదాయమైన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు బి. చేతన్ రెడ్డి, బి. చైతన్యరెడ్డి విజేతలను అభినందించి, వారి సృజనాత్మకతకు ప్రశంసలు కురిపించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేయగా, ఉపాధ్యాయులు పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రసంగాలు చేశారు. భోగి మంటల చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పండుగను ఆత్మీయ వాతావరణంలో జరుపుకున్నారు.

## బాలుర ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



బద్వేల్ అర్బన్ జనవరి 09 ప్రభాతవార్త :

శ్రీ కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు సంక్రాంతి సెలవులకు ముందు ఆఖరి రోజు బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు గాజులపల్లె వెంకటసుబ్బారెడ్డి, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ సానె రమేష్ రాజా ప్రారంభించగా పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు బోధనేతర సిబ్బంది ముందుండి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. మొదట భోగి మంటలు, కోలాటాలు, పతంగులు ఎగురవేయడం, రంగవల్లుల పోటీలు, సంక్రాంతి పాటలు మొదలగు కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అందరూ మధ్యాహ్నం సహపంక్తి భోజనాలను ఆరగించారు. అలాగే సాయంత్రం వడలు, నాన్‌వెజ్ కర్రీస్‌తో సంక్రాంతి మూడు రోజుల మిశ్రమ కార్యక్రమాలు, వంటకాలతో తీరికలేకుండా ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి దుంపల మల్లీశ్వరి, మండల విద్యాశాఖ అధికారి ప్రమీలలు సందర్శించి వారి ఆనందాన్ని తెలియజేశారు. తదుపరి రంగవల్లుల పోటీలలో గెలుపొందిన మరియు పతంగుల ఎగరేవేయటలో విజేతలకు బహుమతి ప్రధానం గావించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్స్ చింతల నాగేశ్వరావు, అనుపూర్ మహబూబ్ బాషా, నగిలి బాలయ్య, నల్లబోతుల కొండయ్య లు దగ్గరుండి పర్యవేక్షించారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు



పుల్లంపేట: జనవరి 9( ప్రభాతవార్త)

మండల కేంద్రంలోని శ్రీ ప్రత్యూష హై స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ముగ్గురు పోటీలు నిర్వహించి గాలిపటాల తయారు చేయడం, భోగిమంటలు వేసి పిల్లలకు ప్రసాదం వండి పంచిపెట్టారు. ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం వల్ల మన యొక్క నాగరికత అంతరించకుండా భవిష్యత్తులో పిల్లలు కూడా తెలుసుకునేందుకు దోహదపడుతుందని హాజరైన విద్యార్థిని తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ సంక్రాంతి అంటే ఏమిటి మూడు రోజులు సంబంధించిన భోగి, పెద్దల పండగ, పశువుల పండగ లను గురించి ఈ పండుగలను గతంలో ఏ విధంగా పెద్దలువైభవంగా నిర్వహించే వారిని కూడా విషయాలను ఆయనసవివరంగా విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి




మదనపల్లె, జనవరి 9 ప్రభాతవార్త :

తిరుపతిలో చోటు చేసుకొన్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి మరణించిన వారి కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని వాల్మీకిసంఘం రాష్ట్ర అధ్యక్షులు పులిశ్రీనివాసులు డిమాండ్ చేశారు. తిరుపతిలో జరిగిన ఘటనను నిరసిస్తూ గురువారం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు జరుపుకునే ముఖ్యపండగల్లో వైకుంఠ ఏకాదశి ప్రధానమైందన్నారు. వైష్ణవ దేవాలయాలకు భక్తులు వెళ్ళి ఉత్తర ద్వారం ద్వారా వైకుంఠ దర్శనం చేసుకోవడం ఆనవాయితీ అన్నారు. టిటిడి ఈఓ, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తిరుపతి క్యూలైన్లలో ఆరుమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వీరందరికి పరిహారం చెల్లించి బాధ్యులైన టిటిడి ఈఓను సస్పెండ్ చేయాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయసింహ, దేవా, జగదీష్, నరసింహులు, లక్ష్మినారాయణ, రమణప్ప, వెంకటరమణ, క్రిష్ణప్ప, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నాల్గవ తరగతి చిన్నారి కేశాలు దానం

మదనపల్లె, జనవరి 9 ప్రభాతవార్త :



నాల్గవ తరగతి చదువుతున్న చిన్నారి ధనుశ్రీ గురువారం హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో కేశాలు దానం చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్కర్‌సిద్దిక్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన రామాంజులు, సునీత దంపతుల కుమార్తె దనుశ్రీ హెల్పింగ్‌మైండ్ కార్యాలయంకు వచ్చి ఉచితంగా కేశాలు దానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా చిన్నారికి ప్రశంసాపత్రంతో పాటు పూలమొక్క బహూకరించి అభినందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్, హర్ష, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో రూ.4.5కోట్లతో పల్లెపండగ పనులు

మదనపల్లె, జనవరి 9 ప్రభాతవార్త :



మదనపల్లె రూరల్ మండలంలో పల్లెపండగ పథకం కింద రూ.4.5కోట్లతో సిసిరోడ్లు, బిటి రోడ్డు పనులు జరుగుతున్నట్లు ఎంపిడిఓ తాజ్‌మస్రూర్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో పల్లె పండగ కింద 74సిసిరోడ్లు రూ.3కోట్లతో చేపట్టడనం జరిగిం దన్నారు. వేంపల్లి బిటిరోడ్డు రూ.1.5కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. రూరల్ మండలంలో 25గోకుల్‌షెడ్లు మంజూరు కాగా ఇప్పటికే 19షెడ్లు పనులు పూర్తి అయ్యాయన్నారు. ఒక్కొక్క షెడ్డు రూ.2.30లక్షలతో పనులు జరు గుతున్నాయన్నారు. మొత్తం షెడ్ల నిర్మాణానికి రూ.54.77లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇంకా ఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకంలో భాగంగా పల్లె పండగ కింద ఇంకా గ్రామాల్లో ప్రజా అవసరాల మేరకు రూ.3కోట్లతో ప్రతిపా దనలు పంపడం జరిగిందన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మదనపల్లె, జనవరి 9 ప్రభాతవార్త :



వైకుంఠ ఏకాదశి సందర్భంగా ముందస్తుగా గురువారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుక్రవారం ఆలయంలో జరిగే వైకుంఠ ఏకాదశి పండగ ఏర్పాట్లను పరిశీలించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఉత్తరద్వార ప్రవేశంలో కూడా భక్తులకు సౌకర్యం కల్పించాలన్నారు. పోలీసులు కూడా బందోబస్తు నిర్వహించాలని సిఐ ఎర్రసావల్లిని కోరారు. మున్సిపాలిటి వారుకూడా ఆలయం వద్ద పారిశుద్ధ్యం పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోవర్ధన్, సిబ్బంది రాజశేఖర్, అంకయ్య, నాయకులు భాస్కర్, షంషీర్, రఘుపతినాయుడు, జేసిబి వేణు, నాగమణి, మంజునాథ్, గురుమూర్తి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

## వెలుగు సంస్థలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



మదనపల్లె, జనవరి 9 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో గురువారం ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. వెలుగుస్కూల్ సెక్రటరీ ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ ఉపాధ్యాయబృందం, సిబ్బంది, వృద్ధులు, పిల్లలు ముందస్తు సంక్రాంతి వేడుకల్లో పాల్గొని సంబరాలు జరిపారు. సాంప్రదాయబద్ధంగా వెలుగు సంస్థలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పశువులకు అలంకరణ చేసి చిట్లాకుప్ప వెలిగించి పూజలు చేశారు. సాంప్రదాయ వంటకాలను కూడా చేశారు. వృద్ధులు, పిల్లలు ముందస్తు వేడుకల్లో ఎంతో సంబరాలుజరిపారు. వెలుగు సంస్థ ఆవరణంలో మహిళలు ముగ్గులు వేసి అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో పాతిమా జయంతి




మదనపల్లె, జనవరి 9 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని దేవతానగర్‌లో ఉన్న చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో గురువారం సావిత్రిబాయి పూలేతో పాటు విద్యాసంస్థలు నడిపిన తొలి ముస్లిం మహిళ షేక్ ఫాతిమా జయంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు ఎంపి.ఆనంద్, జనరల్ సెక్రటరీ కవితారాణిల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షేక్ ఫాతిమాను స్పూర్తిగా తీసుకొంటూ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తునటువంటి ముత్తు ఆంగ్లమాధ్యమ నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి నిరాశ్రయులకు, బాలబాలికలకు విద్యను అందిస్తున్నామన్నారు. చదువుల తల్లిగా ప్రతి ఒక్క ఆడపిల్ల తయారు కావాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్మీజనార్ధన స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి

రామసముద్రం, జనవరి 9 ప్రభాతవార్త :



మండలంలోని పురాతన లక్ష్మీజనార్ధనస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పురష్కరించుకొని భక్తులుకోసం గౌనివారి కుటుంబ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయానికి పెద్దఎత్తున మడలం నుంచి కర్నాటక, తమిళనాడు నుంచి భక్తులు హాజరవుతారన్నారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేయడం జరుగుతుందన్నారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు



రామసముద్రం, జనవరి 9 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలోని ఆదర్శ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, స్కూల్ ఛైర్మెన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులతో ముస్తాబయ్యారు. పాఠశాల ప్రాంగణమంతా పచ్చని తోరణాలతనో రంగు రంగులు పూలతో సంబరాలు నిర్వహించారు. ముందస్తు సంబరాల్నోల పాల్గొన్న ప్రిన్సిపాల్ మునిస్వావమి నాయక్, చిన్నూస్వామి ఛైర్మెన్ బాలాజీ, నాగరాజు, ఉపాధ్యాయులు, చొక్కాండ్లపల్లె రమణ, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎస్టీయూచే స్టడీ మెటీరియల్ పంపిణీ

రామసముద్రం, జనవరి 9 ప్రభాతవార్త :

మండలంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులకు ఎస్టీయూచే స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేసినట్లు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి తెలిపారు. మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ 200మందికి, మురళి 300మంది విద్యార్థులకు, ఉపాధ్యక్షులు శంకర్ 50మందికి అరికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మధుసూదన్ 50మందికి సొంత నిధులతో మెటీరియల్ అందజేయడం జరిగింది. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పాఠశాలకు వైస్ ఛైర్మెన్ గేటు వితరణ

కురబలకోట, జనవరి 9 ప్రభాతవార్త :



కురబలకోట మండలం అంగళ్ళు గ్రామం మొలకావారిపల్లెలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ గేటును స్కూట్ కమిటీ వైస్ ఛైర్మెన్ విఠలం మంజునాథ్ విరాళంగా అందజేశారు. పాఠశాల అభివృద్దికి, నాణ్యమైన విద్యను, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వైస్‌ఛైర్మెన్ మంజునాథ్ అన్నారు. పాఠశాల అభివృద్దికి తమ వంతు అభివృద్దికి కృషిచేస్తానని ఆయన తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు గోపాల్‌క్రిష్ణ కలరు.

## అక్రమార్జనే ధ్యేయంగా ఎమ్మెల్యే వరద, కొండారెడ్డిల అవినీతి



ప్రొద్దుటూరు, జనవరి 9 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అక్రమార్జనే ధ్యేయంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. గురువారం తన నివాసంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అవినీతి చేయడంలో వరదరాజుల రెడ్డి, కొండారెడ్డి కొత్తపుంతలు తొక్కుతున్నారని ఆయన విరుచుక పడ్డారు. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి నీతి కథలు వల్లించి తమపై అవినీతి బురదజల్లి ప్రజలను మభ్యపెట్టి గెలుపొందారని విమర్శించారు. గెలుపొందిన అనంతరం అవినీతి చేయరాదని అధికారులతో ప్రమాణం చేయించారని, కానీ ప్రస్తుతం ఆయన, ఆయన తనయుడు అవినీతి చేస్తున్నారని వివరించారు. గతంలో సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో తాము అరాచకాలకు పాల్పడ్డామని నిందలు వేసిన వరదరాజులరెడ్డి ఇప్పుడు అధిక పార్టీ ఎమ్మెల్యేగా ఆయన, ఆయన కుమారుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భీమునిపల్లె లక్ష్మిదేవి, వైస్ ఛైర్మన్ సి.ఎస్.ఖాజామోహిద్దీన్, కౌన్సిలర్లు గుర్రం లావణ్య, గరిశపాటి లక్ష్మిదేవి, సుబ్బారెడ్డి, నాయకులు భీమునిపల్లె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 2ను సవరణలు చేయాలి

ప్రొద్దుటూరు జనవరి 9 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 2 ను ఆప్కాస్ (ఔట్సోర్సింగ్) ఉద్యోగులకు వర్తింపజేసేలా సవరణలు చేయాలని గురువారం ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల యందు ఆప్కాస్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కాంట్రాక్టులోకి తీసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆకాష్ సతీష్, ఆర్వి సుబ్బారావు, దేవ హుస్సేన్, దస్తగిరి, సుబ్బయ్య, శ్రీనివాసులు, పిటి రవి, గోపాలకృష్ణ, రాజశేఖర్, మరియు ఆప్కాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాల నిర్వహణ

పులివెందుల రూరల్, జనవరి 9, ప్రభాతవార్త :



ఆంగ్ల నూతన సంవత్సరంలో తెలుగువారి తొలి పండుగ, పాడిపంటలు ఇంట వెల్లివిరిసే సందర్భంగా, సకుటుంబ సపరివార సమేతంగా, బంధుమిత్రులతో, స్నేహితులతో కలసి సంబరంగా జరుపుకొనే సంక్రాంతి పండుగ ముందస్తు వేడుకలు పులివెందుల పట్టణంలోని శ్రీ విద్యాధరీ పాఠశాలలో బుధవారం జనవరి 9వ తేదీన ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ పండుగ ప్రాశస్త్యాన్ని, సంస్కృతీ సాంప్రదాయాలను, నేటి తరం చిన్నారులకు పాఠశాల స్థాయి నుండే తెలపాలనే మంచి ఉద్దేశ్యంతో ఈ ముందస్తు ఉత్సవాలను ఎంతో సంబరంగా, ఆడంబరగా నిర్వహించినట్లు పాఠశాల సీ.ఈ.ఓ. డి.భానుప్రకాశ్, కరెస్పాండంట్ పి. నాగరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమాలన్నింటిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్ తెలియజేస్తూ అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా నూతన కమిటీ

రాయచోటి జనవరి 9 ప్రభాతవార్త



రాయచోటి సిపిఐ ఆఫీసు నందు ఈ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీకి గౌవర అధ్యక్షులుగా పీఎల్ నరసింహులు అధ్యక్షులుగా శివరామకృష్ణదేవరా ప్రధాన కార్యదర్శిగా పుణ్యమాల రంగారెడ్డి ఉపాధ్యక్షులుగా డి మహేష్ ఉపాధ్యక్షులుగా వి హరినాధ నాయుడు ఉపాధ్యక్షుడుగా బాలకృష్ణారెడ్డి సహాయ కార్యదర్శిగా తప్ప వెంకటేష్ సహాయ కార్యదర్శిగా అంజనప్ప ప్రచార కార్యదర్శిగా ఎన్ బాబు ఉపాధ్యక్షులుగా కాశి కౌశల్ సభ్యులుగా నారాయణస్వామి చౌడప్ప వి సుధాకర్ వెంకటరమణ డి సుధాకర్ భాస్కర్ రెడ్డి కెవిఎస్ నాయుడు వెంకటసుబ్బయ్య శివయ్య జయరామయ్య పరదేశి రెడ్డి ప్రతాపరెడ్డి శంకరయ్య కాశి.

## సెమిష్టర్ ఫలితాలతో గౌతమి విద్యార్థినిల ప్రభంజనం

ప్రొద్దుటూరు జనవరి 9 ప్రభాతవార్త



గౌతమి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థినిల ఎస్‌బి టెట్ విజయవాడ వారు విడుదల చేసిన 5వ సెమిస్టర్ మరియు 3వ సెమిస్టర్ ఫలితాలలో అతు త్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ వై ప్రకాష్ రావు తెలిపారు. మూడవ సంవత్సరం ఐదవ సెమిస్టర్ సిఎంఇ విభాగంలో ఎస్ హర్షిత 98.70 , వి బిందుశ్రేయ 98.60 మరియు వై శ్రీలత 97.40 సాధించారని తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరం మూడవ సెమిష్టర్ ఈసిఇ విభాగంలో వి పూజ 97, టి.మోనిక 96.9, పి యామిని 95.4 మరియు సిఎంఇ విభాగంలో వి శ్రావణి 95.11, డి నందిని 94.78 , వై సంగీత 94.67 అలాగే ఇఇఇ విభాగంలో ఎం దివ్యనయన 88.40 , బి నవ్య శ్రీ 79.20 . మరియు ఎస్ ఆఫ్రిన్ 77.20 సాధించారని తెలిపారు. సెమిష్టర్ ఫలితాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు, రవీంద్రా రెడ్డి, కోడైరెక్టర్ శైలూష, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ, వివిధ విభాగ అధిపతులు జాబీర్ అలి, కోటేశ్వరరావు, విజయమ్మ, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం అభినందించారు.

## గర్భవతులకు వైద్య సేవలు

వీరబల్లి, జనవరి 9, ప్రభాతవార్త:



గర్భవతులకు ప్రభుత్వ వైద్యశాలలో గురువారం వైద్య సేవలను అందించడం జరిగింది. డాక్టర్ మనీషా ఆధ్వర్యంలో వీరికి వైద్య సేవలతో పాటు వారికి కావలసిన అన్ని పరీక్షలను చేయడం జరిగింది. అదేవిధంగా గర్భవతులు అందరికీ ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భవతులకు ఆరోగ్య విషయాలు పైన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ప్రాథమిక వైద్యశాలలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, జబ్బును బట్టి సేవలు అందించడం జరుగుతున్నదని ఆమె చెప్పారు. ప్రతి నెల జరిగే ఈ కార్యక్రమానికి ఆయన భోజన వసతులు కల్పించడం జరుగుతున్నదనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డివెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలోఉచిత పౌష్టిక ఆహారం



కొండాపురం, జనవరి 9, ప్రభాతవార్త :

పట్టణంలోని ప్రభుత్వ వైద్య శాలలో గత ఏడాది కాలంగా ప్రతినెలా రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గర్భవతులకు పౌష్టికాహార భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం S. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఒంటెద్దు జగన్ మోహన్ లింగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు రెడ్డి వెల్ఫేర్ సొసైటీ జాతీయ కన్వీనర్, ఒంటెద్దు రామలింగారెడ్డి గర్భవంతులకు, ఆశవర్కర్లకు, సాదారణ రోగులకు, ఆసుపత్రి సిబ్బందికి పౌష్టికాహార ఏర్పాటుకు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. రెడ్డి వెల్ఫేర్ సొసైటీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలమూరు జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన ఒంటెద్దు రామలింగారెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఒంటెద్దు జగన్ మోహన్ లింగారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ సాంబ శివారెడ్డి, రెడ్డి వెల్ఫేర్ సొసైటీ నాయకులు డాక్టర్ మహాదేవరెడ్డి, రెడ్డి, గాజులపల్లి. నారాయణ రెడ్డి,అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తొండూరు, జనవరి 9, ప్రభాతవార్త :



గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాదికారిణి రేష్మా అన్నారు. తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గురువారం డాక్టర్ రేష్మా ఆధ్వర్యంలో "ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలములోని ఆన్ని గ్రామాలలో ఉన్న గర్భవతులకు ప్రత్యేక గర్భస్థ పరీక్షలు, హిమోగ్లోబిన్, రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువ ఉన్న వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు అందించారు. అలాగే స్కానింగ్‌ల కోసం ఉన్నత ఆసుపత్రులకు పంపించారు. రక్త హీనత నివారణ, ఆసుపత్రి ప్రసవాల ప్రాముఖ్యత ను గురించి ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పించారు. అలాగే రక్త నివారణ కొరకు ఉచితంగా చిక్కీలను గర్భవతులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆరీఫుల్లా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, హెల్త్ సూపర్వైజర్ శశికళ, స్టాఫ్ నర్సు అనూష, ఫార్మసీ ఆఫీసర్ ఓబులేసు, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, కమ్యూనిటీ హెల్త్ అధికారిణిలు సోమేశ్వరి, సాయి దివ్య, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిప్యూటేషన్‌పై సుండుపల్లికి పంచాయతీ కార్యదర్శి

సుండుపల్లి, జనవరి09,ప్రభాతవార్త:

చిట్వేల్ మండలంలో చిట్వేల్ గ్రామ పంచాయతీ లో పంచాయతి కార్యదర్శిగా పని చేసిన శంకర్ డిప్యూటేషన్‌పై సుండుపల్లి మండలం సుండుపల్లి గ్రామ పంచాయతి కార్యదర్శిగా నియమించడం జరిగిందని సుండుపల్లి ఎమ్ పి డి ఒ సుధాకర్ రెడ్డి తెలియజేసారు.

## తిరుమలనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవం

మైదుకూరు, జనవరి 09, ప్రభాతవార్త:

తిరుమలనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవం ప్రతి సంవత్సరం బండి కుటుంబీకులు ఆధ్వర్యంలో కన్నుల పండుగగా జరుపుతారు. మైదుకూరు మండలంలోని యల్లంపల్లి సమీపాన పురాతన ఆలయం ఉన్నది ఈ దేవాలయానికి భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిత్యం చేస్తూ ఉంటారు అక్కడ వైకుంఠ ఏకాదశి పర్వదినాన బ్రహ్మ ముహూర్తాన సుప్రభాత సేవ, హోమాలు, బండి కుటుంబీకుల ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవ కార్యక్రమం. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం. భక్తాదులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు

తొండూరు, జనవరి 9, ప్రభాతవార్త :

మండలంలోని మల్లెల జడ్పీ ఉన్నత పాటశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం ముగ్గుల పోటీలకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి విచ్చేసి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతకుంట నాగిరెడ్డి, మాజీ కోఆప్షన్ నెంబర్ పందిళ్ళపల్లె సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రాజంపేట అర్బన్ ,జనవరి 8 ప్రభాతవార్త




నందలూరు మండలం జాతీయ రహదారిలో ఆల్విన్ కర్మాగారం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించాడు. గురువారం రాత్రి మోటార్ వాహనములు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి.మృతి చెందిన వ్యక్తి నాగిరెడ్డిపల్లి వాసిగా గుర్తింపు.గాయాలు అయిన వ్యక్తులు ఒంటిమిట్ట మండలం కోనరాచ పల్లి వారిగా గుర్తింపు.లారీని ఓవర్టేక్ చేసి ఎదురుగా వస్తున్న మోటార్ వాహనాన్ని ఢీకొనడంతో సంఘటన జరిగింది.మృతి చెందిన వ్యక్తి వారం క్రితమే కువైట్ నుంచి వచ్చినట్టు సమాచారం.

## మల్లయ్య కొండ ఆదాయ వేలం పాటలు వాయిదా

తంబళ్లపల్లె జనవరి 9 తర్వాత :

తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండలో ప్రతి ఏటా జరిగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదాయ వనరుల పై వేలం పాటలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శశి కుమార్, ఈవో ముని రాజా, ఎస్సై లోకేష్ రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ కొండకిట్టాలు వేలం పాటలు ప్రారంభించారు. ఈ వేలం పాటల నిర్వహణలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని వేలం పాటల నిర్వహణకు అడ్డు తగిలారు. గతంలో జరిగిన వేలం పాటల ద్వారా వచ్చిన ఆదాయం ఖర్చు చేసిన నిధుల వివరాలను లెక్క చెప్పాలని పట్టుపట్టారు. గత ఆదాయ వనరుల లెక్కలు చెప్పక పోతే వేలం పాటలు నిర్వహించరాదని తగేసి చెప్పడంతో దేవాదాయ శాఖ అధికారులు గత ఆలయ ఈవోను రప్పించి అనంతరం వేలంపాటలు నిర్వహిస్తామని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 20 వ తేదీ నుండి 25 వ తేదీ లోపు వేలం పాటల నిర్వహణ తేదీ ఖరారు చేస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ వేలం పాటలలో టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ఉత్తమ రెడ్డి, తులసీదర్ నాయుడు, రామచంద్ర, సుధాకర్ రెడ్డి, నరసింహులు, చలపతి నాయుడు, పురుషోత్తం, బేరి శ్రీనివాసులు, సోమశేఖర్, ధన శేఖర్, రామలింగారెడ్డి, జైపాల్ నాయుడు, చలపతి నాయుడు, స్వామి రెడ్డి, రామాంజులు, శ్రీనివాసులు, శివ కుమార్ నాయుడు, వెంకట్ రెడ్డి, ఆదిరెడ్డి, మ్యూజికల్ శివ, బిజెపి నాయకులు శంకర్ రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చర్చించిన అంశాలపై పరిష్కార చర్యలు తీసుకుంటాం

**రాయచోటి జనవరి 9 ప్రభాత వార్త**

అన్నమయ్య జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేయాలని రాజంపేట పార్లమెంటు సభ్యులు మరియు జిల్లా అభివృద్ధి స మన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ పివి మిథున్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ నందలి పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో రాజంపేట పార్లమెంటు సభ్యులు, చైర్మన్ మిథున్ రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట, తంబళ్లపల్లె శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, చిత్తూరు, వైఎస్ఆర్ జడ్పీ చైర్మన్‌లు శ్రీనివాసులు, శారద హాజరయ్యారు. సమావేశ ప్రారంభంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రాజంపేట పార్లమెంటు సభ్యులు, చైర్మన్ మిథున్‌రెడ్డికి, సభ్యులకు సాదరంగా ఆహ్వానం పలికారు. సమావేశంలో మిథున్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా సమావేశం నిర్వహించడం సంతోషకరం. జిల్లాలో కేంద్ర రాష్ట్ర పథకాలు వినాయక పథకాలను నిర్వహిస్తున్నాయి. వాటి అమలు, పథకాల అమలకు రావాల్సిన నిధులు ఏ విధంగా తీసుకురావాలి, క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఏ విధంగా నిధులు సమర్ధవంతంగా ఉపయోగించాలన్నది ముఖ్య ఉద్దేశ్యం. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మదనపల్లిలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు కూడా కేంద్ర క్యాబినెట్లో చేర్చడం జరిగింది. జల్జీవన్ మిషన్ కు సంబందించిన పన్నులు వేగవంతం చేయాలని, అలాగే వాటర్షెడ్ పనులను కూడా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సభ్యులు సమావేశంలో లేవనెత్తిన అంశాలన్నిటిని నోట్ చేసుకోవడం జరిగింది. ఎంపీ లాడ్స్ కింద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎంపీలు ప్రతిపాదించిన అత్యవసర పనులు ఏవైతే ఉన్నాయో వాటికి సంబంధించి పది రోజుల్లోగా డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని పరిపాలన అనుమతులు పొందేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సిపిఓకు కలెక్టర్ సూచించారు. రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ మండలాలు, గ్రామాల్లో పంచాయతీ మున్సిపల్ మండల తీర్మానం మేరకు పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రాత్రి వేళల్లో వైద్యులు, నర్సులు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చిత్తూరు జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామ సభల్లో ప్రతిపాదించిన సీసీ రోడ్లు, కాలువ నిర్మాణాలకు సంబంధించి ఎక్కడెక్కడ పనులు చేపట్టిన వివరాలను ప్రజాప్రతినిధులకు అందించాలని కోరారు. అంతకుముందు సమావేశం ప్రారంభంలో జిల్లాలో అమలవుతున్న పథకాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో జెడ్పి సీఈఓ ఓబులమ్మ వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



# హోటళ్ళు, రెస్టారెంట్లను తనిఖీ



**బద్వేల్ అర్బన్, జనవరి 9 ప్రభాతవార్త**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్ళు, రెస్టారెంట్లను గురువారం మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా నెల్లూరురోడ్డులో పలు హోటళ్ళు తనఖీ చేయగా ఒక చోట ఫ్రిడ్జ లో నిల్వ ఉంచిన ముందు రోజు వండిన బిర్యానిలోని మాంసపు ముక్కలు మరియు కుళ్ళిన కోడిగుడ్లు వున్నాయన్నారూ. ఫ్రిడ్జలలో నిల్వఉంచిన ఆహార పదార్థాలను గుర్తించిన ఆయన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటేషన్ సెక్రటరీలు తరచుగా హోటల్లలో తనిఖీ చేస్తూ వుండాలన్నారు. హోటల్లో నందు పరిశుభ్రత చాలా ముఖ్యమని హోటల్ నుండి వచ్చే చెత్త మరియు వ్యర్థాలు ఎట్టి పరిస్థితుల్లో బయట వేయకుండా చెత్త సేకరణ వాహనాలలో వేయాలని తదితర సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమీషనర్‌తో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్ లుమరియు శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు

# మహిళల శరీరాకృతిపై మాట్లాడినా, సంజ్ఞ చేసినా లైంగిక వేదింపే!

(కేరళ హైకోర్టు సంచలనాత్మక తీర్పు)

**బద్వేలు లీగల్, జనవరి 09 ప్రభాతవార్త :**

యత్ర నారియస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత అని మనుస్మృతి భోదిస్తుంటే అనగా ఎక్కడైతే మహిళలను గౌరవిస్తామో అక్కడ దేవతలుంటారని అర్థం, అలాంటిది మన హిందూ దేశంలో మహిళల పట్ల ప్రతి ఒక్కరూ సభ్యత కలిగి వ్యవహరించవలసిన తీరును మరిచి వారిని వ్యంగ్యంగా వర్ణించినా, వారి శరీరాకృతిపై మాట్లాడినా, సంజ్ఞలతో వ్యవహరించినా తప్పిదముతో కూడిన శిక్షార్హమవుతుంది. వివరాలలోకి వెళితే... కేరళ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ ఉద్యోగి ఓ మహిళా ఉద్యోగి తనపై దాఖలు చేసిన పిటీషన్‌ను కొట్టివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించిన వ్యాజ్యములో పూర్వాపరాలను పరిశీలించిన న్యాయస్థానం మహిళల శరీరాకృతిని గురించి కామెంట్లు చేసినా, మాట్లాడినా లైంగిక వేదింపుగానే పరిగణించాలని సంచలనాత్మక తీర్పును వెలువడిస్తూ కేరళ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ ఉద్యోగి దాఖలు చేసుకున్న వ్యాజ్యమును కొట్టివేస్తూ ఆయన వినతిని త్రోసిపుచ్చింది. కాబట్టి మహిళల పట్ల సభ్యతతో వ్యవహరించడం మనందరి విధి. ఏ విధంగా కూడా ఏ సమయంలో కూడా ఎట్టి పరిస్థితుల్లో కూడా మహిళల పట్ల అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తించడం వారి శరీరాకృతులపై కూడా ఏలాంటి సంజ్ఞలుగాని, కామెంట్లుగాని చేయరాదు. విస్మరిస్తే శిక్షార్హులవుతారు. తస్మాత్ జాగ్రత్త.

# లో ఓల్టేజి సమస్యలను పరిష్కరించాలి



**పీలేరు జనవరి 09 ప్రభాతవార్త ః**

పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న లో ఓల్టేజి సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. పీలేరు మండలంలోని గురువారం పీలేరు మండల వైస్ ఎంపీపీ హరితా వెంకట రమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు శిరీష మాట్లాడుతూ పట్టణంలోని పద్మావతి నగర్, నాగిరెడ్డి కాలనీ ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్య ఉందని, కొత్తగా ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసి ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ట్రాన్స్కో ఏఈ మహమ్మద్ ఇలాహి స్పందిస్తూ పట్టణంలో ఇండ్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, విద్యుత్ సమస్య పరిష్కారానికి తగిన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాలు చూపితే లోపలికి సమస్యను నివారించవచ్చని అన్నారు. మరో ఎంపీటీసీ లలిత మాట్లాడుతూ పట్టణంలో కొత్తగా ఇళ్ళు నిర్మించుకునే వారు తమ ఇండ్లకు విద్యుత్ సర్వీస్ కోసం ట్రాన్స్కో కు ఆన్ లైన్ ద్వారా డబ్బులు కట్టినప్పటికీ లైన్మెన్ మధు విద్యుత్ సర్వీస్ ఇవ్వడానికి రూ.2000 చొప్పున అడుగుతున్నాడని ఆరోపించారు. ఇదేంటని ప్రశ్నించే ప్రజా ప్రతినిధుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. అతనిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ హరిత వెంకట రమణ, ఇంచార్జ్ ఎంపీడీఓ లతీఫ్ ఖాన్ మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో చెత్తాచెదారం నిండుకుని దుర్వాసన వెదురుజల్లుతొందని, పంచాయతీ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో ఈ సమస్యలు పరిష్కరించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పైన శిక్షణ



**చిన్నమండెం జనవరి9 ప్రభాతవార్త:**

మండలంలోని కొత్తపల్లి మరియు చాకిబండ యూనిట్ పరిధిలో ఉన్న మామిడి రైతులకు గురువారం ప్రకృతి వ్యవసాయ విధానాల పైన రైతు సాధికార సంస్థ ఏ పి సి ఎన్ ఎఫ్ వారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గీత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాలు పొందాలని మన ఆరోగ్యాలతో పాటు నేల ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ మండల టీం లీడ్ చందు రెడ్డి మామిడి పంటలో పాటించవలసిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులకు తెలియజేశారు. మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు పండించినటువంటి ఉత్పత్తులకు మార్కెటింగ్ లో ఉన్న అవకాశాలు పిజియస్ సర్టిఫికేషన్ రైతు సాధికార సంస్థ ద్వారా ఎలా పొందుతారు సర్టిఫికేషన్ వల్ల ఉపయోగాలు స్పష్టంగా రైతులకు వివరించారు.

# రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**బద్వేలు, జనవరి 9, ప్రభాతవార్త**

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ఇందుకోసం రాజ్యాంగాన్ని కాపాడుకుందాం దేశాన్ని రక్షించుకుందాం అనే నినాదంతో ఈనెల 20వ తేదీన ఛలో కర్నూల్ జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలు విడుదల చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ బందెల ఓబయ్య, జిల్లా నాయకులు చంద్రశేఖర్ లు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఆమోదింపబడి పూర్తయినా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదను అతి కొద్దిమంది కార్పొరేట్లకు అందజేస్తూ దేశాన్ని అప్పుల పాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు సవరించి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నదని, ప్రభుత్వ రంగ సంస్థలను నిస్సిగ్గుగా ప్రైవేటుపరం చేస్తున్నదని వారు విమర్శించారు. దేశంలో ప్రజా సుపరిపాలన కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రచించిన రాజ్యాంగ అమలకు మనువాద బిజెపి ప్రభుత్వం ఏ మాత్రం ఇష్టపడడం లేదని, తమకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చుకోవడంలో భాగమే పార్లమెంటులో అంబేద్కర్ పైన అమిత్ షా వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని వారు విమర్శించారు. మనువాద నిరంకుశ వైఖరికి నిరసనగా ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన రాయలసీమ జిల్లాల సదస్సు ను నిర్వహిస్తున్నామని ఈ సదస్సు కు రాయలసీమ అభ్యుదయవాదులు, మేధావులు విద్యావంతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జకరయ్య, చంద్రమోహన్ రాజు మరియు ఏరియా నాయకులు రామరాజు, అనిల్, విజయరావు, బాబు, జైపాల్, రేనాటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరిని చదివించాలి



**దువ్వూరు, జనవరి 09, ప్రభాతవార్త:**

గ్రామాలలో వయోజనల్‌గా ఉండి చదువు రాని వారిని గుర్తించి వారిని అందరిని చదివించాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు నిర్లక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉల్లాస్ పథకం కింద వచ్చిన మెటీరియల్, పుస్తకాలను స్వచ్ఛందంగా పనిచేసే వాలంటరీలకు అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులలో చదువుకున్న వారిని గుర్తించి వారి ద్వారా విద్యను అందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



**చిట్వేలి, జనవరి 9,ప్రభాతవార్త:**

స్థానిక చిట్వేలి లోని శ్రీ సాయి వికాస్, శ్రీ పద్మావతి పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని రంగవల్లులతో, మామిడి తోరణాలతో సంక్రాంతి శోభ సంతరించుకునేలా పెద్ద ఎత్తున అలంకరించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గల పోటీలలో, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. భోగి మంటలు , గౌరీ ప్రతిమను ఏర్పాటుచేసి చుట్టూ చేరి పాటలు పాడారు. గాలిపటాలు ఎగురవేసి ఆనందం వ్యక్తపరిచారు. ఇరు పాఠశాల కరస్పాండెంట్లు తిరుమల రెడ్డయ్య, మాదినేని లతా లావణ్య లు మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలకు, ఆచారాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుందన్నారు. జాగ్రత్తలతో ఆనందంగా బంధుమిత్రులతో కలిసి సంక్రాంతిని జరుపుకోవాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక ఐసిడిఎస్1 సెంటర్లో బాధ్యసిబ్బంది సుధా రాణి పిల్లలతో కలిసి ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు.

# ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన ఆలయాలు

**గాలివీడు, జనవరి 9(ప్రభాతవార్త):**



శ్రీ మహావిష్ణువుకి ఎంతో ప్రీతి పాత్రమైన ముక్కోటి ఏకాదశి(వైకుంఠ ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రముఖ దేవాలయాలను ముస్తాబు చేశారు. పెద్దూరులోని బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వర ఆలయం, గేట్‌లోని శ్రీ కోదండ రామాలయాలలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయాలకు రంగు రంగుల విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరింపచేశారు. శుక్రవారం వేకువజామునే మూలవిరాట్, ఉత్సవమూర్తులకు పలు అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాట్లకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# ఒడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం శుభపరినామం



**వాల్మీకిపురం, జనవరి 09 ప్రభాతవార్త:**

బ్రిటీష్ వారితో విరోచితంగా పోరాడిన స్వాతంత్ర సమరయోధుడు, వడ్డెర నాయకుడు ఒడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం జనవరి 11న అధికారికంగా నిర్వహించడం శుభపరినామమని పీలేరు నియోజకవర్గ వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామస్వామి అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని స్వాగతిస్తు జనవరి 11వ తేది ఒడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు. గురువారం విజయవాడలోని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ నుంచి జీవో పత్రాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్, రాష్ట్ర వడ్డెర సంఘం నాయకుడు మురళికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

**పీలేరు జనవరి 9 ప్రభాతవార్త ః**



నియోజకవర్గంలోని కలికిరి పట్టణంలోని రామ్ నగర్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు నారే గరుడా రెడ్డి గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి విశ్రాంతి ఉపాధ్యాయులు ప్రస్తుత ఉపాధ్యాయులు వారి బంధువులు మృతదేహన సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు శుక్రవారం కలికిరిలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# ముందస్తు సంక్రాంతి సంబరాలు

**ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 9 ప్రభాతవార్త :**



స్థానిక గురవయ్య తోట వీధిలోని శ్రీ రాజీవ్ హై స్కూల్లో సంక్రాంతి గురువారం ముందస్తు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు తెలుగు సాంప్రదాయ బద్ధమైన సంక్రాంతి పండగ విశిష్టత గురించి వేషధారణలో డుడు బసవన్న వేషాలు,ముగ్గుల పోటీలు, భోగిమంటల కార్యక్రమాలు అలాగే సంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా నిర్వహించారు.పల్లెటూరి వాతావరణ సాంప్రదాయ పద్ధతులను పిల్లలకు తల్లిదండ్రులు సాంప్రదాయ బద్ధమైన అలవాటు నేర్పించాలని తెలియజేస్తూ వివిధ కార్యక్రమాల్లో నిర్వహించారు.పిల్లలు సంస్కృతిక వేషధారణ వల్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ముక్కమల్ల సుధాకర్, చైర్మన్ అనుమల వెంకట రాజేష్, హెడ్మాస్టర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాజోలిని పరిశీలించిన ప్రాజెక్ట్ చైర్మెన్



**దువ్వూరు, జనవరి 09, ప్రభాతవార్త:**

జిల్లాకు ప్రధాన నీటి వనరు అయినా రాజోలి ఆనకట్టను కేసీ కెనాల్ ప్రాజెక్ట్‌ను చైర్మెన్ రామలింగారెడ్డి గురువారం పరిశీలించారు. రాజోలి ఆనకట్ట వద్ద మైదుకూరు కాలువకు, చాపాడు కాలువకు ఎలా నీరు వెలుతుంది కుందూ నదిలో ఎంత ప్రవాహం ఉంటే ఈ రెండు కాలువలకు నీరు ప్రవహిస్తుందనే విశయాలను పరిశీలించారు. అక్కడ ఏవైనా ప్రాజెక్టు తరపున చేయవలసిన పనులు ఉన్నాయా అని అధికారులతో ఆరా తీశారు. అలాగే పలు చోట్ల కేసీ ప్రధాన కాలువకు మరమ్మత్తులు కూడ చేయవలసి ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మెన్ కోనేటి హరినాథ్, మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, పాపినేని రాంబాబు, డీఈ పుల్లయ్య, ఏఈ జమాల్ వల్లిలు పాల్గొన్నారు.

# 40మంది గర్భవతులకు వైద్య పరీక్షలు



**దువ్వూరు, జనవరి 09, ప్రభాతవార్త:**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద గురువారం గర్భవతులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారులు సురేష్ బాబు, హేమలత, వికసిత, రోషిణిలు పాల్గొని 40మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 26 మందికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించి పలు సూచనలు అందజేశారు. 17మందికి కష్టతరంగా కాన్పులు ఉంటాయని భావించి వారిని ప్రొద్దుటూరు ఆసుపత్రిలో వైద్య సలహాలు తీసుకోవాలని పేర్కొన్నారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతిరోజు ఆకుకూరలు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శాంతకుమారి, సువర్ణ, రాజగోపాల్, బయన్న తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలేను ప్రతి మహిళా ఆదర్శంగా తీసుకోవాలి

**బద్వేలు అర్బన్, జనవరి 9, ప్రభాతవార్త**

సావిత్రిబాయి పూలేను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని మహనీయుల ఆశయ సాధన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రప్రథమ మహిళల ఉపాధ్యాయినులు, స్రీ విద్యాదాతలు సావిత్రిబాయి పూలే, షేక్ ఫాతిమాల 194 వ మాతోత్సవ జయంతి ఉత్సవ వేడుకలు మహనీయుల ఆశయాల సాధన కమిటీ,బద్వేలు పట్టణ అభివృద్ది సొసైటి, ఆవాజ్ కమిటీ,బద్వేలు పట్టణ ఆర్యవైశ్య వర్తక సంక్షేమ సంఘం మరియు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా సిద్దవటం రోడ్డులోని పూలే,సావిత్రి బాయి పూలే విగ్రహాలకు, షేక్ ఫాతిమా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ అభివృద్ది సొసైటి కార్యాలయంలో బద్వేలు మండల విద్యాధికారిణి ప్రమీలమ్మ, లైబ్రేరియన్ లక్ష్మిదేవి తో పాటు పన్నెండు మంది మహిళా ఉపాధ్యాయినీలను శాలువా తో సన్మానించారు. అలాగే అరవింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ ముఖ్య అతిథులు డాక్టర్ మార్కారెడ్డి మాట్లాడుతూ మహనీయులను స్మరించుకొని వారి ఆశయాల సాధన కొరకు కృషిచేయడం ప్రతి ఒక్కరీ బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మహనీయుల ఆశయాల సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బద్వేలు గురుమూర్తి , పట్టణ అభివృద్ది సొసైటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు,ఆవాజ్ కమిటీ అధ్యక్షులు యస్.ఎ సత్తార్, యోగివేమన విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు



# నేడు గంగమ్మ దేవత జాతర వేలం పాట

**లక్కిరెడ్డిపల్లె : జనవరి 09 , ప్రభాతవార్త**

మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవత దేవస్థానం నందు ఫిబ్రవరి 28 నుండి మార్చి 2 వరకు జరగబోవు గంగమ్మ జాతరకు సంబంధించి తలనీలాలు, కొబ్బరికాయలు, టోల్గేట్‌లు, ప్రతి ఆదివారం ఏడాది పాటు ఆలయం ముందు కొబ్బరికాయలు, పూలదండలకు సంబంధించిన వేలం పాటను భక్తులు,గ్రామస్తుల సమక్షంలో నేడు బహిరంగ వేలం పాట ను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కరపత్రాల ద్వారా తెలిపారు. ఈ వేలం పాట స్థానిక గంగమ్మ దేవత దేవస్థానం నందు నిర్వహిస్తామని వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ .50 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవలెనని కరపత్రంలో తెలిపారు. వేలం పాట ముగిసిన వెంటనే దక్కించుకున్న తర్వాత సగం డబ్బులు వెంటనే చెల్లించవలెననీ, మిగిలిన డబ్బులు పది రోజుల్లోపు చెల్లించాలని వేలంపాట కరపత్రం లో పేర్కొన్నారు. వేలం పాట దక్కని వారికి తిరిగి రూ.50 వేలు వెనక్కి ఇవ్వబడునని ఆలయ అధికారులు కరపత్రం లో పేర్కొన్నారు. కావున వేలంపాటలో పాల్గొన్న దలుచుకున్న నేడు ఉదయం 10 గంటల లోపు గంగమ్మ దేవత ఆలయ ప్రాంగణంలో చేరుకోవాలని తెలిపారు.

# నేడు మండల సర్వ సభ్య సమావేశం

**లక్కిరెడ్డిపల్లి : జనవరి 09 ప్రభాతవార్త**

నేడు మండల సమావేశంను నిర్వహించనున్నట్లు ఎంపిడివో జి.రెడ్డేయ్య తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ఉపాధి హామీ పథకం, వ్యవసాయ శాఖ, పౌరసరఫరాలు రెవెన్యూ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, ఆరోగ్యశాఖ, తాగునీటి సమస్య, విద్యుత్తు, ఉద్యానవన, రవాణా శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఆబ్కారీ శాఖ, సంక్షేమ హాస్టల్ శాఖ, వాటర్ షెడ్ అటవీశాఖ పలు రకాల శాఖల సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

# ఉద్యాన విద్యార్థులు నిమ్మ ఉత్పత్తులపై పరిశీలన



**రైల్వే కోడూరు జనవరి 9 ప్రభాతవార్త:.**

డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో బీఎస్సీ ఉద్యాన కోర్స్ నాలుగవ సంవత్సరం విద్యార్థులు గురువారం తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని. సీఫల్ హార్బర్ సంస్థను సందర్శించారు. గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానంలో శిక్షణ పొందుతున్న 12 మంది విద్యార్థులు స్థానిక పారిశ్రామిక సందర్శించారు. పెట్లూరు నిమ్మ పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ పి శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఫర్ అర్బన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో నిమ్మ ఉత్పత్తుల తయారీని పరిశీలించారు. ఆ సంస్థలో మొత్తం అనేక విషయాలను తెలుసుకున్నట్లు వారు తెలిపారు. నిమ్మ శుద్ధి, నిమ్మ తైలం పీచుతో పౌడర్ తయారీ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని గురించి తెలుసుకున్నారు. ముఖ్యంగా రానున్న రోజుల్లో రైల్వే కోడూరు ప్రాంతంలో కూడా ఇటువంటి ప్రయోగాలను కూడా చేసేందుకు విద్యార్థులు కూడా శక్తివంతం లేకుండా కృషి చేసేందుకు పరిశోధన జరుగుతుంది. అదేవిధంగా విద్యార్థులకు చక్కటి పరిశోధన గురించి ప్రయోగాల పట్ల విద్యార్థులకు అవగాహనను కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త కాంతర్ నాయక్, ఏ డి ఆర్ డాక్టర్ బి హరి మల్లికార్జున రెడ్డితో పాటు సంస్థ ఎండీ ఎలవర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు సంక్రాంతి సంబరాలు

**గాలివీడు, జనవరి 9(ప్రభాతవార్త):**

మండల కేంద్రంలోని శ్రీ రవిచంద్ర సీనియర్ సెకండరీ స్కూల్ సీబీఎస్ఈ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ లిజాజాయ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సంక్రాకంతి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. గురువారం పాఠశాల విద్యార్థుల తల్లులకు ముగ్గల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఎదుట భోగి మంటలను వేసి ఉల్లాసంగా ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. భారతదేశం భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని, పండుగలు ప్రజల ఆచార్య వ్యవహారాలకు ప్రతిబింబాలని ఆమె కొనియాడింది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ గరుడప్ప, ఉపాధ్యాయ బృందం రమేష్‌బాబు, ఆంజనేయులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, రెడ్డిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్‌బాబు, పలువురు ఉపాధ్యాయినులు, పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

